

# జీవితం-సినిమా

నీ యిల్లు రా ఫిల్ము గానూ! నీ కెప్పుడూ ఒక్కలాటి వేషాలే దొరకా! నీ పిక్చరికి ఒరిజినల్ మ్యూజికు జమపడా! డబ్బులేకుండా చూసి హీరోయిను కాల్చీటివ్వా! ఝింత పన్జేశావూ! పొడుగు తగ్గించెయ్యడమే! ఇంకేమన్నా ఉందా. నీ కిలాటి పిదపకాలబ్బుద్ధులెలా పట్టుబడ్డాయయ్యా! ఇంతటి ఓఘాయిచ్చాని కెలా వడిగట్టావయ్యా! ఇంకా నయం, నాతో అన్నావు. ఇంకెక్కడా అనబోకు. నీ నెత్తిన కానీపెట్టి వేలం వేస్తే ఏగాణీగ్గానడెవడూను. ఆఖరికి నిడివి తెగ్గోస్తే దేశం బాగుపడుతుందని తెగ్గోస్తున్న మున్షీ మురార్జీ రాజాజీలు కూడా నీ కార్యాన్ని హర్షించరేవనుకున్నావో గాని.

సంస్కరణలంటే మజాకా అనుకున్నారా. ఇవాళ చెయ్యి అనగానే రేప్పొద్దున్న చేసి పారేస్తే ఏంగాను. అన్నిపన్లూ అలా చక చక తెవిలి పోయూరుకుంటే జనానికి మందకొండితనం వచ్చేస్తుంది. సంస్కరించడానికి దుబారాలూ, పరిష్కరించడానికి సమస్యలూ కూడా హార్తికర్పూరంలా హరించిపోతాయి. కలికంలో కూడా లేకుండాపోతాయి. అప్పుడు నాయకులంతా ఏంగానూ. గోళ్ళు కొరుక్కుంటేమటుకు అవి ఎన్నాళ్ళొస్తాయటా?

వాళ్లక్కాలక్షేపం ఉండదు. పత్రికలకి రాసిందికే వుండదు. జనానికీ చదివిందికే వుండదు. పెద్ద పెద్ద ప్రవక్తలు, కాదల్చుకున్న విమర్శకులూ, ఇతర అడ్డమైన వాళ్ళూ తలకిమాసినవాళ్ళు ఒంటి కాలిమీద లేచి తిట్టిపోసిందికి రెడీగా ఏ వుంటుందీ? కాంగ్రెస్ రాజకీయాల్ని, లంచగొండితనాన్ని, సమకాలిక సాహిత్యాన్ని ఎంతకని తిడుతూ కూచోగల్రు. వెధవది పాత సబ్జెటు. పైగా సాహిత్యాన్నేవన్నా అంటే సినిమా వాళ్ళలా పడూరుకోరుగదా వెధవాయిలూ చెవలాయిలూ. మీరు వట్టి వెధవాయిలుస్మండి. మీకు మారాత బోధపళ్ళేదుస్మండీ. పుట్టిన వాళ్ళంతా బొడ్నాడని వెధవాయిలే గదా! పుట్టబోయేవాళ్ళంత ప్రజ్ఞ మీ కెక్క డేడిసిందంటా? మీకు మమ్మల్ని తిట్టిందికేగాక మెచ్చుకుంది గ్గూడా తాహతులేదుస్మండీ, అని తిట్టి పోస్తారాయె. అంచేత సినిమానేనా దక్కించకపోతే యలా తిట్టుకుందికి. కనస్ట్రక్టివ్ క్రిటిసిజమ్ ఇహ దేని మీద అఘోరిస్తాం జెప్పు.

నీపాటి తెలివితేటలల్లేకనేనా--మినిష్టర్లు, గిల్లికజ్జాలు పెట్టుకుంటున్నారూ? వాళ్ళన్చూసి నేర్చుకోవచ్చు యంతైనా. రాచకార్యాలన్నీ ఒక్కపెట్టున చక్కపెట్టి నిజంగానే ప్రభుత్వం చేసే పనుల్జేసేస్తే పాలిటిక్స్‌లో డెడ్లా కొచ్చెయ్యదూ. వాళ్ళు చూడు ఎంత పొదుపుగా స్తిమితంగా చూడముచ్చటగా పోట్లాడుకుంటున్నారో. ఒక ఆర్డరు ప్రకారం వంతు వేసుకుని రోజు కొక్కటంటే ఒక్క స్టేటుమెంటు అంతే. ఉన్నాయిగదా అని అన్ని స్టేటుమెంట్లూ ఒక్కపూటే యిచ్చేద్దామనుకుంటే బాతూ, బంగారు గుడ్లూ కథలా అయిపోతుంది గదా!

అంచేత మైడియర్ వెంకటేశం, అదీ ఇందులో ధర్మసూక్ష్మం. పొడుగు తగ్గించమన్నారు గదా అని నువ్వు చటుక్కున తగ్గించేస్తే కొంపలంటుకుపోతాయి. మరేం భయంలేదు. ఇరవైవేల పుటేజికీ ఎన్నడూ మోసం రాదు. ఒక్కడుగు లోటు రాదు. పాతిక ముప్పైవేలు తీయదల్చుకున్న హేమ హేమీలున్నారు. వాళ్ళవెనక నిలబడు, మరేం ధోకా లేదు.

* * * *

అంతేకాదు--మరొక ఉపద్రవాన్ని కూడా నువ్వు కనుక్కోలేక పోతున్నావు. ఈ నిడివి తగ్గిస్తివా, కథలో అక్కర్లేని పాటలూ, అణాకాణీ డాన్సులూ పోయి అవక తవకలూ

అతుకులూ గత్రా లేకుండా నీట్‌గా ఉంటుంది. అపళంగా అది సహజంగా అమరిపోయి జీవితానికి దగ్గిర్గా వెళ్ళిపోయి అందులో కలిసిపోతుంది. అపైనిహ చెప్పేదేవుంది.

ఇప్పటికీ మరో మరో విధాన గాపోయినా టెక్నికల్ హంగారమాల ధర్మవా అని పిక్చర్లు లైఫ్‌లైక్‌గా తయారైపోతున్నాయి సీనులో. స్మెల్లీసు వచ్చాక కంపు గొడుతున్నాయట. ఇహ నెప్పుడో అప్పుడు "ఫీలీస్" గూడా రాకతప్పదు. అనగా మధుబాల మొహం నీకు బావుందని తోస్తే సినిమా చూస్తూ చూస్తూ ఆవిడ బుగ్గమీద చిటికెయ్యొచ్చుట. దిలీప్ కుమార్ ధోరణి నచ్చకపోతే భుజంతట్టి అబ్బీ ఇటు తిరిగి నటించమనొచ్చు. మరొహడూ మరొహడూ పేట్రేగిపోతూంటే నెత్తినోమొట్టి కాయ మొట్టచ్చు. ఎవడన్నా ఏడుస్తూవుంటే వాణ్ణి కావలించుకుని భోర్న మనవూ యాడవచ్చు. ఈ విధంగా జీవితం, సినిమా ఏకమైపోతాయి.

* * * *

ఒకపక్క ఇదిలా ఉండగా మరొహ పక్కనించి సత్యజిత్రాయి లాంటివాడున్న దున్నట్లు చూపించేసి ఫిలిమ్‌ని జీవితానికి దగ్గిర్గా లాక్కొచ్చేస్తున్నాడు.

అలాయితే మంచిదేగా అనేవు కొంపదీసి. వెనకటికి జర్మనీవాడూ రష్యావాడూ తగూలాడుకున్నప్పుడు రష్యా వాళ్ళు జర్మనీలోకీ, జర్మనీ వాళ్ళు రష్యాలోకీ వచ్చేసి రష్యా జర్మనీ, జర్మనీ రష్యా అయూరుకున్నట్టు జీవితం సినిమా, సినిమా జీవితం అయిపోగలవు. ఆ లోపలే డబ్బు నొల్లుకుందికీ ఛాన్సుండదు. సినిమాలన్నీ జీవితంలా ఉంటే అసలే జీవితం అంటే మొహం మొత్తుతున్న జనం సినిమా కెందుకురా అని మానీగ్రలు.

అంచేత ఇపుడు సినిమా ఉన్నదున్న టుంచేయాలి. జీవితాన్ని సినిమా దగ్గరికి జరపాలే తప్ప సినిమాని యంత మాత్రం ఇటు లాక్కూడదు. ఇందులో శ్రమా లేదు. జీవితం సహజంగానే సినిమావేపు వెళ్ళిపోతుంది గదా. సినీమా కథలాగే తలా తోకా లేకుండా, అస్తవ్యస్తంగా అతుకుల బొంతలా తయారవుతూంది గదా. తెలుగు సినిమాలో కారెక్టర్లలాగే జీవితంలో మనుషులూ, పెద్దలూ, పిన్నలూ, అపకతవకగా మాటాడుతూ నడుస్తున్నారు గదా. అర్థంపర్థం లేకుండా పుడుతూ గిడుతున్నారు గదా. సినిమాలో కామెడీ లాగే అన్ని రాజధానుల్లోనూ సర్కారు ప్రహసనాలు సాగుతున్నాయి గదా. ఛీప్

మినిష్టర్లు, మిస్చీఫ్ మినిష్టర్లు నవరసాలు పోషిస్తున్నారు కదా. సినిమాలో డైలాగులాగే నాయకులు--రాజకీయాలవాళ్ళే అని గాదు--సినిమావాళ్ళే అని గాదు--సినిమావాళ్ళు, సాహిత్యపువాళ్ళు డైలాగు స్టేటుమెంట్లిచ్చేస్తున్నారు గదా. డైలాగులాగే కృత్రిమంగా మాటాడుతున్నారు గదా.

సినిమాలో డైరెక్టరుగాళ్ళలాగే జీవితంలో సాహిత్యపర్వతాలు, పానకాలు, రాజకీయ మేరువులూ, నైతిక ఎవరెస్టులూ పాత్ర పోషణ గురించి బొత్తిగా పట్టించుకోడం మానేశారు - మరోడి మరోడి పాత్ర పోషణనికాదు. ఎవడికి వాడే శాయశక్తులా కారెక్ట రెశాసినేషన్లు చేస్తున్నారు. జీవితం ఇంత జోరుగా ఉత్సాహంగా సినిమా దగ్గరికీ జరిగిపోతూ ఉంటే మన సినిమా, జీవితానికి చాలా దూరం అన్న చెవలాయి ఎవడోయీ? అంట.......

* * * *

అయ అయ దయచెయ్యండి. ఇందాకట్నించి ఒక్కలాగ ఆ యొక్క స్వాతి వానకి ముచ్చెపు చిప్పలాగా తవరి కోసమే వెయిట్ చేస్తున్నా. ఏవుంది.......ఈ దిప్పకాయ కనిపిస్తే సొళ్ళుకబుర్లు చెబుతూ కూచున్నా, ధ్యాసంతా మీ మీదనే స్మండీ-

